# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **సుస్థిర, రసాయన రహిత సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జాతీయ మిషన్‌కు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **సహకార సంఘాలను బలోపేతం చేయడానికి అంకుర పరిశ్రమలను ప్రోత్సహించవలసిన అవసరం ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
3. **అమరావతి రాజధాని నిర్మాణ పనులను దశలవారీగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణలో రైతులకు సన్న ధాన్యంపై క్వింటాల్‌కు 500 రూపాయల అదనపు నగదును అందిస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**
5. **రాజ్యాంగ దినోత్సవం ఉత్సవాలను ఈరోజు నుండి ఏడాది పొడవునా నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.**

==========================

సుస్థిర, రసాయన రహిత సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జాతీయ మిషన్‌కు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలను పాత్రికేయులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రకృతి ఆధారిత స్థిరమైన వ్యవసాయ వ్యవస్థలను ప్రోత్సహించడం, పంట సాగు ఖర్చులను తగ్గించడం ఈ మిషన్ లక్ష్యం అని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు)

అలాగే అటల్ నవకల్పనల మిషన్‌ను కొనసాగించడానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. 'ఒకే దేశం.. ఒకే చందా' అనే కొత్త పథకం కింద పరిశోధనాత్మక వ్యాసాలు, పత్రికలు పొందడానికి 6 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కేంద్రమంత్రి వర్గం నిర్ణయించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు.

---------------------------

సహకార సంఘాలను బలోపేతం చేయడానికి అంకుర పరిశ్రమలను ప్రోత్సహించవలసిన అవసరం

ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచించారు. ఢిల్లీలోని భారత మండపంలో ఐ.సి.ఎ. ప్రపంచ సహకార రంగాల సదస్సును నిన్న ఆయన ప్రారంభిస్తూ, గ్లోబల్ సౌత్‌లోని దేశాలు అభివృద్ధి సాధించేందుకు సహకార సంఘాలు దోహదపడతాయని తెలిపారు. దేశంలో సహకార సంఘాలు ఒక ఆలోచన నుండి ఒక ఉద్యమంగా, ఒక ఉద్యమం నుండి విప్లవంగా, ఒక విప్లవం నుండి సాధికారతగా అభివృద్ధి చెందాయని అన్నారు. భారత సంస్కృతికి సహకార సంఘాలు పునాది వంటివని నరేంద్రమోదీ పేర్కొంటూ .

వాయిస్ ( 28 సెకన్లు)

---------------------------

అమరావతి రాజధాని నిర్మాణ పనులను దశలవారీగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ –సీఆర్డీఏ పై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాల్నీ ఐదు టవర్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. హైకోర్టు, శాసనసభ, సచివాలయం భవనాల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించనున్నామని, రెండున్నరేళ్లలో నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో రైతులకు సన్న ధాన్యంపై క్వింటాల్‌కు 500 రూపాయల అదనపు నగదును అందిస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేశామని, రుణమాఫీ జరగని వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారన్నారు. వారందరికి కూడా ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణను పారదర్శకంగా నిర్వహించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటనలు నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రణాళిక విభాగంలో పారదర్శకత కోసం సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పట్టణ ప్రణాళిక విభాగంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ (33 సెకన్లు)

---------------------------

భారతీయ కుటుంబ వ్యవస్థ, సంస్కృతి సంప్రదాయాలు, నైతిక విలువల పట్ల యువతకు సమగ్ర అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువు, ఉద్యోగం, భవిష్యత్‌తో పాటు నైతిక విలువలు కూడా అవసరమన్నారు. విద్యార్థులు, యువతలో నైతిక విలువలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, తదనుగుణంగా పాఠశాలలో కళాశాలలో

విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ప్రపంచంలోనే విశిష్టమైన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ఈ రోజుతో 75 సంవత్సరాలు పూర్తయింది. రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సారథ్యంలోని కమిటీ పూర్తి స్థాయి రాజ్యాంగాన్ని రూపొందించింది. 1949 నవంబర్ 26వ తేదీన అప్పటి రాజ్యాంగ అసెంబ్లీ దీనిని ఆమోదించింది. మరొక రెండు నెలల తరువాత 1950 జనవరి 26వ తేదీన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగ దినోత్సవాన్ని సంవిధాన్ దివస్ అని కూడా పిలుస్తారు. ఈ సందర్భంగా 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభనుద్దేశించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన ప్రసంగం ఒకసారి విందాం..

...వాయిస్ 24 సెకన్లు

---------------------------

రాజ్యాంగ దినోత్సవం ఉత్సవాలను ఈ రోజు నుండి ఏడాది పొడవునా నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా పాత పార్లమెంటు భవనం సెంట్రల్ హాలులో ఈ రోజు జరిగే ఒక కార్యక్రమంలో ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు తెలిపారు. నిన్న ఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా జరిగే కార్యక్రమాలలో ప్రజలంతా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "హమారా సంవిధాన్- హమారా స్వాభిమాన్" అన్న నినాదంతో ప్రచార వేడుకలు జరుగుతాయని కిరణ్ రిజుజు తెలిపారు.

ఇదిలా ఉండగా, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా గ్రామ, జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాలు జరుగుతాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి తెలిపారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీలో భాగమైన 15 మంది అసాధారణ మహిళల విశేష కృషితో పాటు రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ దీక్షా దక్షతలను తెలియజేయడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

యువత సామాజిక మాధ్యమాల వాడకం పట్ల స్వీయ నియంత్రణ పాటించాలని ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. విజయవాడలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాలలో నిన్న ఏర్పాటు చేసిన సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ బెదిరింపులు వాటి ప్రభావంపై నిర్వహించిన అవగాహన కార్యశాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ( 33 సెకన్లు )

---------------------------

దక్షిణ బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం.. మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో దక్షిణకోస్తా, ఉత్తరకోస్తాలో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నెల

28, 29న శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. తీర ప్రాంతాల్లో 35 నుంచి 55 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని  సూచించింది.

మరోవైపు తెలంగాణలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ  కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతుందని పేర్కొంది. పొగమంచు కారణంగా వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

=====================